

కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి తీరని అన్యాయం


సిపిఎం ఆధ్వర్యాన నిరసన



నిరసన తెలుపుతున్న సిపిఎం నేతలు

భీమవరం టౌన్:మన రాష్ట్రానికి అన్యాయం చేసిన కేంద్ర బడ్జెట్‌ను ప్రజలంతా వ్యతిరేకించాలని సిపిఎం మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శుక్రవారం వెంప బస్టాండ్ సెంటర్లో కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ కార్పొరేట్లకు రాయితీలు, ప్రజలపై భారాలు వేసేలా ఉందన్నారు. ప్రజలు, రైతుల ఆకాంక్షలకు అనుగుణంగా బడ్జెట్‌లో మార్పులు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నేతలు తోటి శుభకర్‌రావు, వేగి మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు రుణాలేవీ..!



'ఏలూరు జిల్లా వార్షిక పంట రుణాల లక్ష్యం రూ.7,300 కోట్లు. కౌలురైతులకు రుణాల మంజూరు లక్ష్యం రూ.250 కోట్లు నిర్ణయించడం ఏమిటీ.. జిల్లాలో 75 శాతానికిపైగా సాగును కౌలురైతులు చేస్తున్నారు.. అందుకు అనుగుణంగా వారికి పంట రుణాల లక్ష్యం రూ.రెండు వేల కోట్లకు పెంచాలి' అని ఏలూరు జిల్లాకు చెందిన మంత్రి కొలుసు పార్థసారథి అధికారులను ఆదేశించారు. భూయజమానితో సంబంధం లేకుండా కౌలురైతులకు పంట రుణాలు అందించేందుకు చర్యలు తీసుకోవాలన్న మంత్రి ఆదేశాల అమలుపై సర్వత్రా చర్చ సాగుతోంది.

పంట రుణాల లక్ష్యంపై మంత్రి పార్థసారథి ఆదేశాలు అమలయ్యేనా
ఏలూరు జిల్లాలో రూ.2 వేల కోట్లు రుణాలివ్వాలని మంత్రి ఆదేశం
'పశ్చిమ'లో అంతకు మించి రుణాలిస్తేనే కౌలు రైతులకు న్యాయం
లక్ష్యానికి అనుగుణంగా కొరవడిన అధికారుల కార్యాచరణ
కౌలుకార్డుల జారీలో తొలగని ఇబ్బందులు
రెండు జిల్లాల్లో మూడు లక్షల మంది వరకూ కౌలురైతులు
కార్డుల జారీ లక్ష్యం మాత్రం లక్షా 82 వేలే

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏలూరు జిల్లాలోనే కాదు.. పశ్చిమగోదావరి జిల్లాలోనూ కౌలురైతులకు పంట రుణాలపై అధికారులు నిర్దేశించిన లక్ష్యం అత్యంత దారుణంగా ఉంది. కౌలురైతులకు పంట రుణాల మంజూరులో గత ప్రభుత్వంలోని పాలకులు, అధికారులు వ్యవహరించిన తీరు అత్యంత దారుణంగా మారిందని చెప్పొచ్చు. ప్రభుత్వం మారడంతో కౌలురైతులకు జిల్లా వ్యవసాయ వార్షిక రుణ ప్రణాళికలకు అనుగుణంగా పంట రుణాలు మంజూరు చేయాలని సమాచార శాఖా మంత్రి పార్థసారథి జిల్లా సమీక్షా సమావేశంలో అధికారులకు ఇచ్చిన ఆదేశాలు అమలు చేస్తేనే కౌలురైతులకు న్యాయం జరుగుతుంది. మంత్రి ఆదేశాలకు అనుగుణంగా అధికారుల కార్యాచరణ ఏమాత్రం కన్పించడం లేదు. ప్రస్తుత పరిణామాలు అందుకు అద్దం పడుతున్నాయి. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలో మూడు లక్షల మంది వరకూ కౌలురైతులు ఉన్నారు. 2014-19 మధ్య టిడిపి ప్రభుత్వ హయాంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 3.15 లక్షల మంది కౌలురైతులకు కౌలుకార్డులు జారీ చేసిన పరిస్థితి కొనసాగింది. ప్రస్తుతం కౌలుకార్డుల జారీపై అధికారులు తీసుకున్న లక్ష్యం అందులో సగం కూడా లేని పరిస్థితి నెలకొంది. 'పశ్చిమ'లో లక్షా ఆరు వేలు, ఏలూరు జిల్లాలో 76 వేలు మొత్తం లక్షా 82 వేల కౌలుకార్డులు మాత్రమే జారీ చేయాలని అధికారులు లక్ష్యం నిర్ణయించుకున్న పరిస్థితి నెలకొంది. మరో లక్షా 20 వేల మంది కౌలురైతులకు కౌలుకార్డుల జారీ ప్రశ్నార్థకంగా మారింది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో వార్షిక పంట రుణాల లక్ష్యం రూ.ఏడువేల కోట్లకుపైగానే ఉంది. జిల్లాలో 75 శాతానికిపైగా వ్యవసాయ సాగు చేస్తున్న కౌలురైతులకు పంట రుణాల కింద రెండు జిల్లాల మొత్తంగా చూసిన రూ.600 కోట్లకు మించి లేకుండా పోయింది. రెండు జిల్లాల్లో దాదాపు రూ.14 వేల కోట్ల పంట రుణాల లక్ష్యంలో పట్టుమని రూ.600 కోట్లు కూడా ఇవ్వకపోతే వాస్తవ సాగుదారుడైన కౌలురైతులు ఏవిధంగా సాగు చేయాలో ప్రభుత్వం చెప్పాల్సి ఉంది. ఇప్పటికైనా అధికారులు మంత్రి ఆదేశాలకు అనుగుణంగా కౌలురైతులకు పంట రుణాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని అంతా కోరుతున్నారు.

నిబంధనలు మార్పుచేసి కౌలుకార్డులు జారీ చేసేనా?

గత ప్రభుత్వం భూయజమాని అంగీకారంతో కౌలుకార్డులు జారీ చేయాలని నిబంధనల్లో మార్పులు చేసింది. దీంతో భూయజమానులు కౌలురైతులకు కౌలుకార్డులు ఇచ్చేందుకు అంగీకరించడం లేదు. దీంతో కౌలుకార్డుల జారీ, రుణాల మంజూరుప్రక్రియ సక్రమంగా జరగడం లేదు. దీంతో పంట దెబ్బతింటే నష్టపరిహారం, బీమా పరిహారం, అన్నదాత సుఖీభవ వంటి పథకాలు అందే పరిస్థితి లేకుండాపోయింది. ప్రభుత్వం నిబంధనలను మార్పుచేసి కౌలురైతులకు సులభతరంగా కార్డులు జారీ అయ్యేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది. అలా చేయకపోతే కౌలురైతులకు న్యాయం జరిగే పరిస్థితి లేకుండాపోతుంది. దీనిపై ప్రభుత్వం ఏవిధంగా ముందుకు సాగుతుందో వేచిచూడాలి.

గోదావరి తగ్గుముఖం

ప్రజాశక్తి - ఆచంట

వారం రోజులుగా దోబూచులాడుతున్న వశిష్టగోదావరి వరద శాంతించడంతో మండలంలోని లంక గ్రామాలు జలదిగ్బంధం నుంచి బయటపడ్డాయి. శుక్రవారం ఉదయం నుంచి క్రమేపీ గోదావరి తగ్గుముఖం పట్టింది. దీంతో లంక గ్రామాలైన అయోధ్యలంక, పుచ్చల్లంక, భీమలాపురంలో వరద నీరు పూర్తిగా తొలగిపోయింది. లోతట్టు ప్రాంతాలు వరద ముంచెత్తడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న స్థానికులు వరద తొలగడంతో కాస్త ఊపిరి పీల్చుకున్నారు. పలు ఇళ్ల చుట్టూ చేరిన వరద నీరు తిరిగి గోదావరిలోకి చేరింది. కోడేరు, భీమలాపురం, కరుగోరుమిల్లి, పెదమల్లం పుష్కర ఘాటులు నీటి నుంచి తేరుకున్నాయి. పెదమల్లం మాచేనమ్మ అమ్మవారి ఆలయం వద్ద పుష్కర ఘాట్‌లో దాదాపు నాలుగు అడుగులు మేర వరద తగ్గింది. నదిలో వరద ప్రవాహ వేగం ఇంకా తగ్గకపోవడంతో నాటు పడవల రాకపోకలపై నిషేధం కొనసాగుతోంది. వరద తగ్గుముఖం పట్టడంతో మండలంలోని లంక గ్రామాల ప్రజలతోపాటు అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. మండల ప్రత్యేకాధికారి పిచ్చయ్య, తహశీల్దార్ ఐపి.శెట్టి, ఎంపిడిఒ పి.నరసింహప్రసాద్ ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు వరద సహాయక చర్యలు పర్యవేక్షిస్తున్నారు. లంక గ్రామాల్లోని పల్లపు ప్రాంతాల్లో కూరగాయలు పండించిన రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఆచంట ఎస్ఐ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో పుష్కర ఘాట్ల వద్ద పోలీసు బందోబస్తు కొనసాగుతోంది.


కోడేరులో తగ్గుముఖం పట్టిన గోదావరి

యలమంచిలి: గోదావరి వరద తగ్గుముఖం పట్టినప్పటికీ లంక గ్రామాలైన కనకాయలంక, పెదలంక, బాడవ, లక్ష్మీపాలెం, అబ్బిరాజుపాలెం, వడ్డిలంక తదితర గ్రామాలను మాత్రం వరద వీడటం లేదు. కనకాయలంక గ్రామంలోని కాజ్‌వేపై ఇప్పటికీ సుమారు ఆరడుగుల మేర వరద నీరు ప్రవహిస్తుండటంతో అక్కడి ప్రజలు పడవలపై రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి కొనసాగుతోంది.


యలమంచిలి : తగ్గిన వరద ఉధృతి

మత్స్యకారుల ఉపాధికి వరద దెబ్బ

వారం రోజులుగా కొనసాగుతున్న వరద కారణంగా గోదావరి పరివాహక ప్రాంతాలైన బాడవ, ఏనుగువానిలంక, చించినాడ, యలమంచిలిలంక, వడ్డిలంక, లక్ష్మీపాలెం, గంగడపాలెం, అబ్బిరాజుపాలెం, దొడ్డిపట్ల, బూరుగుపల్లి, కంచుస్తంభంపాలెం తదితర గ్రామాల్లోని వేలాది మంది మత్స్యకారుల వేటకు ఆటంకం కలగడంతోపాటు గోదావరిలో ఇసుకతీత పనులు పూర్తిగా నిలిచిపోవడంతో ఆయా మత్స్యకార కుటుంబాలకు పూట గడవని పరిస్థితి నెలకొంది. ఉపాధి కోల్పోయిన తమకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి నిత్యావసర సరుకులను అందించాలని ఆయా గ్రామాల మత్స్యకారులు కోరుతున్నారు.

రొయ్యల సాగూ వరద పాలు

మండలవ్యాప్తంగా గోదావరిని ఆనుకొని వందలాది ఎకరాల్లో రొయ్యల సాగు ఉంది. వరద నేపథ్యంలో హడావుడిగా రొయ్యల పట్టుబడి చేసి అయినకాడికి విక్రయించారు. దీంతో లక్షల్లో నష్టపోవాల్సి వచ్చిందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గోదావరి దోబూచులాట

తొమ్మిది రోజులుగా వీడని ముంపు

ప్రజాశక్తి - కుక్కునూరు

పది రోజులుగా పెరుగుతూ తగ్గుతూ వస్తున్న గోదావరి వరద దోబూచులాట కొనసాగుతోంది. శుక్రవారం సాయంత్రం వరకూ తగ్గిన గోదావరి వరద మళ్లీ స్వల్పంగా పెరిగి నిలకడగా ఉంది. భద్రాచలంలో గురువారం 49 అడుగులకు చేరిన వరద శుక్రవారం రెండు అడుగులు తగ్గి 47 అడుగులకు చేరింది. దీంతో రెండో ప్రమాద హెచ్చరికను అధికారులు ఉపసంహరించారు. మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. ఇప్పటికే మండలంలోని దాచారం-కుక్కునూరు, ముత్యాలంపాడు-వింజరం మధ్య రహదారులను గోదావరి వరద ముంచెత్తడంతో తొమ్మిది రోజులుగా ఆయా గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి రావాలంటే చుట్టూ 15 కిలోమీటర్లు తిరిగి అనేక ఇబ్బందులు పడుతూ చేరుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. వరద ముంపు తగ్గడంతో సీతారామనగరం-వేలేరు మధ్య రాకపోకలు కొనసాగుతున్నాయి. ఇప్పటికే మండలంలోని గొమ్ముగూడెం, లచ్చిగూడెం, వేలేరుపాడు మండలంలోని రేపాకగొమ్ము గ్రామాలకు చెందిన వరద బాధితులు మండలంలోని రావికుంట పునరావాస కాలనీలో కౌండిన్యముక్తి గ్రామానికి చెందిన వరద బాధితులు మద్రిపాడు పునరావాస కాలనీలో తలదాచుకున్నారు. ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తుండటంతో ప్రాజెక్టుల్లో సామర్థ్యానికి మించి ఉన్న నీటిని దిగువకు వదులుతున్నారు. దీంతో గోదావరికి వరద ముప్పు పొంచి ఉందని విలీన మండలాల ప్రజలు ఆగస్టు వరకూ అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు. దీంతో ఆ ప్రాంత ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

స్పిల్‌వే నుండి 11,06,947 క్యూసెక్కుల వరద జలాల విడుదల

పోలవరం: పోలవరంలో గోదావరి నీటిమట్టం శుక్రవారం సాయంత్రానికి స్వల్పంగా పెరిగింది. పోలవరంలో గోదావరి నీటిమట్టం 23.877 మీటర్లకు చేరుకుంది. వరద జలాలను ఎప్పటికప్పుడు 48 గేట్ల ద్వారా దిగువకు విడుదల చేస్తున్నారు. ఎగువ ప్రాంతాల నుండి వస్తున్న 11,06,947 క్యూసెక్కుల వరద జలాలు దిగువకు విడుదల చేసినట్లు ఇఇ మల్లికార్జునరావు, డిఇ మాధవరావు తెలిపారు. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే ఎగువన 33.150 మీటర్లు, స్పిల్‌వే దిగువన 24.800 మీటర్లు నమోదైనట్లు ఇఇలు పి.వెంకటరమణ, మల్లికార్జునరావు తెలిపారు.

మరో గల్ఫ్ బాధితురాలి ఆక్రందన

స్వదేశానికి రప్పించాలంటూ మత్స్యపురి వాసి వీడియో సందేశం

ప్రజాశక్తి - వీరవాసరం

గల్ఫ్ బాధితుల కన్నీటి కథలు ఒకొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. ఇటీవల అన్నమయ్య తదితర జిల్లాలకు చెందిన బాధితులు వీడియో పోస్టు చేయడం, దానిపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వారిని సురక్షితంగా స్వదేశానికి రప్పించడంతో అక్కడ వెట్టిచాకిరీలో మగ్గుతున్న పలువురిలో ధైర్యం నింపినట్లయ్యింది. దీంతో అక్కడ నిర్బంధంలో చిక్కుకున్న పలువురు వీడియోసందేశాలు పంపుతూ తమను రక్షించాలని కోరుకుంటున్నారు. అదే తరహాలో వీరవాసరం మండలం మత్స్యపురికి చెందిన మహిళ ఒక వీడియో విడుదల చేయడం చర్చనీయాంశమైంది. సిఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్‌ను ఉద్దేశించి విడుదల చేసిన ఈ వీడియోలో తనను రక్షించాలని కోరింది.


బాధితురాలు జ్యోతి

వీరవాసరం మండలం మత్స్యపురి గ్రామానికి చెందిన బొక్కా జ్యోతి సంవత్సరం క్రితం మస్కట్‌కు ఉపాధి నిమిత్తం వెళ్లింది. ఆమె భర్త బొక్కా ప్రియస్వామి నరసాపురంలో ఒక హోటల్‌లో పని చేస్తున్నాడు. బాధితురాలి భర్త తెలిపిన వివరాల ప్రకారం తన భార్య వెళ్లిన మూడో నెల నుండి ఆమె పని చేస్తున్న ఇంటి యజమానులు వేధింపులకు గురిచేస్తున్నారు. ఈ విషయం పాలకొల్లులోని ఏజెంట్ అల్లూరి రవికి తెలిపినా పట్టించుకోలేదు. ఇదే విషయాన్ని ఈ నెల ఒకటో తేదీన ప్రియస్వామి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ ఎటువంటి స్పందనా లేదని వాపోయాడు. తన భార్య జ్యోతి తల్లి ఊర్మిళ ఈ విషయం తెలిసి తీవ్ర మనస్తాపంతో అనారోగ్యం పాలైందన్నారు. తక్షణమే తన భార్యను ఇండియాకు రప్పించేలా రాష్ట్ర ప్రభుత్వం చొరవచూపాలని కోరాడు. అదే విషయాన్ని జ్యోతి తన వీడియో సందేశంలో పేర్కొంది.

28న కేంద్ర, రాష్ట్ర మంత్రులకు సన్మానం

పాలకొల్లు: ఈ నెల 28న పాలకొల్లు ఛాంబర్స్ ఆధ్వర్యంలో మంత్రులను సత్కరించనున్నట్లు ఛాంబర్ అధ్యక్షులు కారుమూరి నరసింహారావు చెప్పారు. శుక్రవారం ఛాంబర్స్ బిల్డింగ్‌లో మీడియా సమావేశంలో వివరాలు చెప్పారు. కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ, రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడును ఛాంబర్ తరపున ఘనంగా సన్మానిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఛాంబర్ తరపున మంత్రులకు వినతి పత్రాలు సమర్పిస్తున్నట్లు చెప్పారు.

నేడు జిల్లాకు మంత్రి అచ్చెన్నాయుడు రాక

భీమవరం: రాష్ట్ర వ్యవసాయం, సహకారం, మార్కెటింగ్, పశుసంవర్థక, డైరీ డెవలప్మెంట్, మత్స్య శాఖల మంత్రి కింజరపు అచ్చెన్నాయుడు ఈనెల 27వ తేదీ శనివారం జిల్లాకు రానున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా ముంపునకు గురైన ప్రాంతాలను పరిశీలించి, అధికారులతో సమీక్షించనున్నారు. తణుకు నియోజకవర్గం దువ్వ ప్రాంతంలోని పంట పొలాలను, ఇరిగేషన్ ఛానల్స్ ను పరిశీలించి, అనంతరం తాడేపల్లిగూడెం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన ఫోటో ఎగ్జిబిషన్ తిలకిస్తారు. అక్కడే సంబంధిత అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని జిల్లాలోని పంట నష్టాలు పై సమీక్షిస్తారు.

తాడేరు డ్రెయిన్లో గుర్రపుడెక్క తొలగించాలి

సిపిఎం ఆధ్వర్యాన కౌలురైతుల ఆందోళన

ప్రజాశక్తి - ఆచంట

తాడేరు డ్రెయిన్ ప్రక్షాళన చేపట్టకపోవడంతో భారీ వర్షాలకు నారుమళ్లు, నాట్లు నీట మునిగాయని, తక్షణం ఆ డ్రెయిన్లో గుర్రపుడెక్క తొలగించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం సాయంత్రం ఆచంట వేమవరం ఇసుక గురువులో తాడేరు డ్రెయిన్ వద్ద సిపిఎం ఆధ్వర్యంలో కౌలు రైతులు ఆందోళన చేపట్టారు. తాడేరు డ్రెయిన్‌ను తక్షణమే ఆధునికీకరించాలని, నష్టపోయిన కౌలురైతులకు పరిహారం అందించాలని, గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ముంపుబారిన పడ్డ కౌలురైతులను ఆదుకోవాలని, నష్టపోయిన రైతులకు విత్తనాలు సబ్సిడీపై అందజేయాలని నినదించారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ కాలువల ఆధునికీకరణ చేపట్టకపోవడంతో కౌలు రైతులకు సాగు ప్రారంభంలోనే కష్టాలు ప్రారంభమయ్యాయన్నారు. తాడేరు డ్రెయిన్‌పై ఆధారపడిన కొడమంచిలి, పెనుమంచిలి, ఆచంట వేమవరం గ్రామాల్లో సుమారు వెయ్యి ఎకరాలు సాగులో ఉందని తెలిపారు. తాడేరు డ్రెయిన్ నుంచి మురుగునీరు బయటికి ప్రవహించకపోవడంతో రైతులు నష్టపోతున్నారని తెలిపారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి కౌలు రైతులకు సబ్సిడీపై విత్తనాలు సరఫరా చేయాలని ఆయన డిమాండ్ చేశారు.


తాడేరు మురుగు డ్రెయిన్ వద్ద ఆందోళన చేస్తున్న కౌలు రైతులు

కార్యక్రమంలో సిపిఎం నాయకులు గుత్తుల రంగారావు, సిర్రా నర్సింహమూర్తి, తలుపూరి బుల్లబ్బాయి, వెన్నపు ప్రసాదరావు, రైతులు బొమ్మిశెట్టి ఆదినారాయణ, కాండ్రేకుల హరిబాబు, గుత్తుల సత్తిరాజు, కాపా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మిరామియాకోడుపై రక్షణగోడ

కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

పట్టణంలోని మెంటేవారితోటలో ఉన్న మిరామియా కోడు ముంపునకు గురవుతున్న ప్రాంతాన్ని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులు అనేక సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఏటా కురిసే భారీ వర్షాలు, వరదల కారణంగా మిరామియా కోడు ఉధృతికి లోతట్టు ప్రాంతాలు జలమయమవుతున్నాయన్నారు. చిన్నపిల్లలు డ్రెయిన్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారని, దీని బారి నుండి కాపాడాలని కలెక్టర్‌కు విన్నవించారు. దీనిపై స్పందించిన జిల్లా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ ఈ డ్రెయిన్‌పై రక్షణ గోడ నిర్మించేందుకు చర్యలు చేపట్టాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు.


మిరామియాకోడును పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

ముంపు బాధితులకు రగ్గులు, పుస్తకాలు, సామగ్రి అందజేత

స్థానిక మెంటేవారితోట రెండో వార్డులో భారీ వర్షాల కారణంగా ముంపునకు గురైన బాధితులకు శ్రీ విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో వివేకానంద సేవాసమితి సహకారంతో రగ్గులు, పుస్తకాలు, గ్లాసులను కలెక్టర్ చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వరద కారణంగా కష్టాల్లో ఉన్న ప్రజలను ఆదుకోవడం మానవత్వానికి నిదర్శనమన్నారు. పదేళ్లుగా వివేకానంద సేవాసమితి చేపట్టిన సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. భవిష్యత్తులో మరెన్నో కార్యక్రమాలు చేపట్టాలన్నారు. శ్రీ విజ్ఞాన వేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ 250 మంది ముంపు బాధితులకు వివేకానంద సేవా సమితి సౌజన్యంతో రగ్గులు, 66 మంది చిన్నారులకు గ్లాసులు, పుస్తకాలు, బిస్కెట్లు పంపిణీ చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ కె.శ్రీనివాసులురాజు, సేవా సమితి అధ్యక్ష కార్యదర్శులు వేగిరాజు శివవర్మ, నారాయణరాజు, శ్రీ విజ్ఞాన వేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి, సభ్యులు కంతేటి వెంకట్రాజు, నందమూరి రాజేష్, వబిలిశెట్టి రామకృష్ణ, విఆర్ఒ అడపా శ్యామ్, ఆర్‌టిసి మాజీ రీజనల్ ఛైర్మన్ మెంటే పార్థసారథి, ఎఎంసి మాజీ ఛైర్మన్ కోళ్ల నాగేశ్వరరావు, మాజీ కౌన్సిలర్లు ఎద్దు ఏసుపాదం, మెంటే గోపీ, స్థానిక నాయకులు మెంటే మనోజ్, తోట సురేష్, బాతు నరేష్, వి.రాంబాబు, నక్క బెనర్జీబాబు పాల్గొన్నారు.

స్వల్పకాలిక టెండర్లకు ఆహ్వానం

జిల్లా జాయింట్ కలెక్టర్ ప్రవీణ్ ఆదిత్య

ప్రజాశక్తి - భీమవరం

తాడేపల్లిగూడెంలోని పురుగు మందుల పరీక్ష లాబొరేటరీకి కావాల్సిన గ్యాస్ లిక్విడ్ క్రోమోటోగ్రఫీ మెషిన్ సరఫరా చేసేందుకు స్వల్పకాలిక టెండర్లకు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ సివి ప్రవీణ్ ఆదిత్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్యాస్ లిక్విడ్ క్రోమోటోగ్రఫీ మెషిన్, దాని సాఫ్ట్‌వేర్‌తో కూడిన కంప్యూటర్ సరఫరా చేసేందుకు ఆసక్తి గల ఉత్పత్తిదారులు, అధీకృత డీలర్ల షార్ట్ టెండర్ల ద్వారా మెషీన్ సరఫరా కోసం టెండరులో పాల్గొనేందుకు జులై 4న ప్రకటన జారీ చేయడం జరిగిందని పేర్కొన్నారు. అయితే ఇచ్చిన గడువు జులై 16వతేదీ లోపు పూర్తయ్యిందని, టెండర్లు రాకపోవడంతో తిరిగి మరలా మూడు వారాల గడువు విధిస్తూ ఆగస్టు 6వ తేదీ వరకూ గడువు పొడిగిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల బిడ్డర్లు ఇఎండి మొత్తం రూ.2 లక్షలు ఆగస్టు 6వ తేదీ మధ్యాహ్నం 12 గంటల్లోపు డిమాండ్ డ్రాఫ్ట్ లేదా బ్యాంకర్స్ చెక్కు సమర్పించాల్సి ఉందని తెలిపారు. అదేరోజు సాయంత్రం 3 గంటలకు టెండర్లు తెరవబడతాయని తెలిపారు. సందేహాలుంటే 8331056658 నంబరును సంప్రదించాలని తెలిపారు.


మాట్లాడుతున్న జెసి

ఆక్వా రైతులకు రాయితీలు అందేలా చూడాలి

ప్రజాశక్తి - పాలకొల్లు

సంక్షోభంలో ఉన్న ఆక్వా రంగానికి కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో మంచి రాయితీలు ఇచ్చిందని, అయితే రాష్ట్ర ప్రభుత్వం వీటిని రైతులకు అందేలా చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు కోరారు. పాలకొల్లులో జై భారత్ క్షీరరామ ఆక్వా రైతు సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర రైతుల సమావేశం శుక్రవారం జరిగింది. సంఘం అధ్యక్షులు గాంధీ భగవాన్‌రాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కూడా ఆక్వాజోన్‌లను వేరు చేయకుండా విద్యుత్ రాయితీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆగస్టు 15వ తేదీలోపు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన రాయితీలు రైతులకు అందకపోతే క్రాప్ హాలిడే వంటి చర్యలు కఠిన తీసుకుంటామని హెచ్చరించారు. ఆక్వా రైతులు బోనం చినబాబు, నాగభూషణం, యువరాజు, కర్నేన గౌరు నాయుడు మాట్లాడుతూ ఐసియులో ఉన్న ఆక్వా పరిశ్రమకు నిర్మలా సీతారామన్ మంచి రాయితీలు ఇచ్చిందని అయితే ఈ రాయితీలు రైతులకు ఫీడ్, సీడ్, ప్రాసెసింగ్ యూనిట్లు అందేలా రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఆక్వా రైతులు తీవ్ర సంక్షోభంలో ఉన్నారని, మేత ధర రోజురోజుకూ పెరిగిపోతోందని చెప్పారు. నాణ్యమైన సీడ్ దొరకడం లేదని, పెరిగిన ధరలకు ప్రాసెసింగ్ యూనిట్‌లు కొనుగోలు చేస్తున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన రాయితీలు అమలు చేయాలని సిఎం చంద్రబాబును మంత్రి అచ్చం నాయుడు, స్థానిక మంత్రి నిమ్మల రామానాయుడు ద్వారా కలిసి త్వరలో వినతిపత్రం సమర్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో రైతులు కోడి విజయ భాస్కర్, గొట్టుముక్కల సూర్య నారాయణ రాజు,అంగర వర ప్రసాద్,మేకా ఫణీంద్ర ప్రసాద్,కుంచే రాంబాబు, రుద్రరాజు సత్యనారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులపై అత్యాచారాలను అరికట్టాలి

ఐద్వా ఆధ్వర్యాన వినతిపత్రం అందజేత

ప్రజాశక్తి - నరసాపురం

చిన్నారులపై అత్యాచారాలను అరికట్టాలని ఐద్వా ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్‌డిఒ కార్యాలయంలో అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ, జిలా కోశాధికారి ఎస్.జయప్రభ మాట్లాడారు. ఈ మధ్యకాలంలో విజయనగరం, వైజాగ్ తదితర ప్రాంతాల్లో చిన్న పిల్లలపై అత్యాచారాలు జరిగాయని తెలిపారు. తాత వరసయ్యే వ్యక్తి కూడా మనవరాలిపై అత్యాచారం చేసిన దుస్సంఘటనలు జరుగుతున్నాయని తెలిపారు. వీటన్నింటినీ అరికట్టాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని తెలిపారు. అయితే ప్రభుత్వం పట్టనట్టుగా ఉంటోందని తెలిపారు. వెంటనే ప్రభుత్వ స్పందించి అత్యాచారాలను అరికట్టాలని, దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐద్వా నేతలు విజయ్ కుమారి, భువనేశ్వరి, నాగమణి, అనసూయ, కుమారి, సుభద్ర పాల్గొన్నారు.


అధికారికి వినతిపత్రం అందజేస్తున్న ఐద్వా నేతలు

బాధితులకు ఆహార పొట్లాల పంపిణీ

ప్రజాశక్తి - భీమవరం టౌన్

పట్టణంలోని మెంటేవారితోట లోతట్టు ప్రాంతాల్లో వరద ముంపునకు గురైన బాధితులకు టిడిపి రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి సౌజన్యంతో ఆహార పొట్లాలను కూటమి నాయకులు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి మాట్లాడుతూ యనమదుర్రు కాలువ పొంగి ముంపునకు గురైన మెంటేవారితోటలోని పేదలకు పది రోజుల నుంచి కూటమి నాయకులు, దాతలు ఆహార పదార్థాలు, ఇతర సామగ్రిని, వస్తువులను అందజేస్తున్నారన్నారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ మెంటేవారితోట లోతట్టు ప్రాంతాలు భవిష్యత్తులో ముంపునకు గురికాకుండా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి వేండ్ర శ్రీనివాస్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఇందుకూరి సుబ్రహ్మణ్యంరాజు, గూడూరి సుబ్బారావు, వీరవాసరం, భీమవరం మండలాల టిడిపి అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

డెంగీపై అవగాహన

గణపవరం:డెంగీ నివారణా మాసోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక మూడో సచివాలయం పరిధిలోని హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్లో శుక్రవారం స్థానికులకు డెంగీ నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రం డాక్టర్ సంతోష్ మాట్లాడుతూ ఈ నెల 31వ తేదీ వరకూ గ్రామాల్లో ప్రజలకు డెంగీపై అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. దోమల వల్ల డెంగీ, చికెన్ గున్యా, మలేరియా వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ అధికారి జాలాది విల్సన్‌బాబు, ఎచ్‌వి.పద్మజ. ఎంఎల్‌హెచ్‌పి నున్న పాప పాల్గొన్నారు.

రత్నమాలకు డాక్టరేట్

ఆచంట:మండలంలోని భీమలాపురం గ్రామానికి చెందిన శ్రీదేవి ఆర్యవైశ్య మహిళా సేవా మండల అధ్యక్షురాలు, స్టేట్ నార్త్ సీనియర్ సిటిజన్ అధ్యక్షురాలు కొత్త కనకరత్నమాల వెంకటేశ్వర్లుకు డాక్టరేట్ వరించింది. ఈ సందర్భంగా ఆమె శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. 1983 నుంచి 2024 వరకూ 41 సంవత్సరాల పాటు అనేక రంగాల్లో కుల, మత, లింగ, బేధాలు లేకుండా ప్రజలకు విశిష్ట సేవలు అందించినందుకు గాను డాక్టరేట్ అందుకుంటున్నట్లు ఆమె తెలిపారు. డాక్టరేట్‌ను తమిళనాడు యూనివర్సిటీ ద్వారా శనివారం తీసుకోనున్నట్లు ఆమె వెల్లడించారు. ఇప్పటికే గ్రామస్థాయి నుంచి ఇంటర్నేషనల్ స్థాయి వరకూ పలు అవార్డులు అందుకున్నట్లు ఆమె వివరించారు. తుది శ్వాస విడిచే వరకూ ప్రజలకు సేవలందిస్తానని రత్నమాల తెలిపారు.

వరద బాధితులకు అన్ చైన్డ్ మినిస్ట్రీ సభ్యుల సాయం

ఆచంట:మండలంలోని అయోధ్యలంక గ్రామంలో వరద నీటితో ఇబ్బందులు పడుతున్న పేదలకు అన్ చైన్డ్ మినిస్ట్రీ సభ్యులు ఆపన్న హస్తం అందజేశారు. అయోధ్యలంక పంచాయతీ పరిధి నకిడిలంక, రావిలంక, పుచ్చల్లంక, మర్రిమూల గ్రామాల్లో నాటు పడవలపై పర్యటించి వరద బాధితులకు అన్ చైన్డ్ మినిస్ట్రీస్ తరపున 600 పులిహోర ప్యాకెట్లు, బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మినిస్ట్రీ సభ్యులు నల్లి అనిల్ మాట్లాడుతూ మినిస్ట్రీ తరపున ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. శుక్రవారం ఉదయం లంక గ్రామాల్లో పర్యటించి పేదలకు పులిహోర ప్యాకెట్లు, బిస్కెట్లు అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విఒఎల సమస్యలు పరిష్కరించాలి

నరసాపురం:నరసాపురం సిఐటియు కార్యాలయంలో శుక్రవారం యలమంచిలి, మొగల్తూరు, నరసాపురం మండలాల ఐకెపి విఒఎల జనరల్ బాడీ సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సమావేశం విఒఎలు కడలి పార్వతి, కట్టా నాగలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. విఒఎల సంఘం జిల్లా అధ్యక్షురాలు అడవి నిర్మలాదేవి మాట్లాడుతూ మూడు సంవత్సరాల కాల పరిమితి గల సర్క్యులర్‌ను రద్దు చేయాలన్నారు. ఉద్యోగ భద్రత కల్పించి, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని, రూ.పది లక్షల వరకూ గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలన్నారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు తెలగంశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న బకాయి వేతనాలు చెల్లించాలన్నారు. ఉద్యోగస్తులను అక్రమంగా తొలగించొద్దని, నూతన ప్రభుత్వంలో రాజకీయ వేధింపులు ఆపాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుబ్బల విజయలక్ష్మి, యడ్లపల్లి పద్మ, బర్రి అలివేలు మంగ తాయారు, జి.వెంకటలక్ష్మి, జి.పద్మావతి పాల్గొన్నారు.

'గోయంకా'కు పది కంప్యూటర్లు అందజేత

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

పెంటపాడు గోయంకా డిగ్రీ కళాశాల ఇంగ్లీష్ ల్యాబ్‌కు 3ఎఫ్ స్వాభిమాన్ ఫౌండేషన్ ద్వారా 10 కంప్యూటర్లను ఉచితంగా పంపిణీ చేసినట్లు 3ఎఫ్ అసిస్టెంట్ మేనేజర్ (సిఎస్ఆర్) శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా 3ఎఫ్ స్వాభిమాన్ ఫౌండేషన్ డైరెక్టర్ సీమ గోయంకా పాల్గొన్నారు. ముందుగా ఆమె కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. అనంతరం కళాశాలలో 3ఎఫ్ ఫౌండేషన్ ద్వారా ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను ఆమె ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రసంగించారు. కార్యక్రమంలో 3ఎఫ్ అసిస్టెంట్ మేనేజర్ శ్రీనివాస్ రెడ్డి, వేమల శ్రీనివాస్, ఫౌండేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - ఆచంట

మండలంలో పెనుగొండ - వల్లూరు, ఆచంట సబ్‌స్టేషన్, వల్లూరు సబ్‌స్టేషన్ పరిధిలో చెట్ల కొమ్మలు తొలగింపు కారణంగా ఆచంట, ఆచంట వేమవరం, కొడమంచిలి, కోడేరు, పెదమల్లం, వల్లూరు, భీమలాపురం, కరుగోరుమిల్లి, కందరవల్లి అయోధ్యలంక, పోడూరు మండలంలోని వద్దిపర్రు గ్రామాల్లో శనివారం ఉదయం 7.30 నుండి మధ్యాహ్నం 1.00 గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని నరసాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.సురేష్ కుమార్ శుక్రవారం విలేకరులకు తెలిపారు. ప్రజలు తమకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

నేడు తాగునీటి సరఫరా నిలిపివేత

నరసాపురం:పట్టణంలో నీటి సరఫరాకు సంబంధించి క్లీనింగ్ పనులు చేపడుతున్నందున్న శనివారం సాయంత్రం తాగునీటి సరఫరాను నిలిపివేస్తున్నట్లు కమిషనర్ వెంకటేశ్వరరావు తెలిపారు. తిరిగి ఆదివారం ఉదయం యథావిధిగా నీటి సరఫరా జరుగుతుందన్నారు. ప్రజలు శనివారం ఉదయ వచ్చే నీరును జాగ్రత్తగా వాడుకోవాలని కమిషనర్ కోరారు.

మొగల్తూరులో గ్రామ సభ

మొగల్తూరు:బహిరంగ మలవిసర్జన వల్ల కలిగే ఇబ్బందులపై మండలంలోని పలు గ్రామ పంచాయతీల్లో శుక్రవారం గ్రామ సభలు నిర్వహించారు. మొగల్తూరు పంచాయతీ వద్ద నిర్వహించిన గ్రామ సభలో సచివాలయ కార్యదర్శి గంటా సుబ్బారావు గ్రామసభ ఆవశ్యకతను వివరించారు. ఈ సభలో గ్రామ సర్పంచి పడవల మేరీ, వార్డు సభ్యులతో పాటు సిపిఎం నాయకులు కొత్త విజయ్ కుమార్, జనసేన నాయకులు లక్కు బాబి, కొప్పాడ నాగరాజు, బొక్కా చంటి తదితరులు పాల్గొని గ్రామంలో పలు సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు.

గ్రామ సభ సమాచారం లేదంటూ ధర్నా

పేరుపాలెం సౌత్ గ్రామంలో శుక్రవారం నిర్వహించే గ్రామ సభకు సంబంధించిన సమాచారం లేదంటూ ఆ గ్రామానికి చెందిన జనసేన నాయకుడు ఓసూరి రాంబాబు, గ్రామ కార్యకర్తలు పంచాయతీ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ స్వరాజ్యం కోసం ఏర్పాటు చేసే గ్రామ సభల సమాచారం కోసం గ్రామంలో విధిగా టాంటాం వేయించాలన్నారు.

ఏమార్చి.. నగదు డ్రా చేసి

నేరాలు - ఘోరాలు

ఆచంట:ఆచంటలోని ఎస్‌బిఐ ఎటిఎంలో నగదు డ్రా చేయడానికి వచ్చిన ఓ మహిళను యువకుడు మాయమాటలతో ఏమార్చాడు. ఆమె వద్ద నుంచి ఎటిఎం కార్డును దొంగిలించాడు. అనంతరం నగదు డ్రా చేసిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. ఆచంట మండలం కోడేరు గ్రామానికి చెందిన ఎర్రంశెట్టి రాఘవమ్మ అంగన్వాడీ వర్కర్‌గా పనిచేస్తోంది. శుక్రవారం ఆమె ఆచంటలోని ఎస్‌బిఐ ఎటిఎంకు నగదు డ్రా చేయడానికి వచ్చింది. అదే సమయంలో ఆమె పక్కనే ఉన్న గుర్తు తెలియని యువకుడు ఆమెను మాయమాటలతో మభ్యపెట్టాడు. ఈ క్రమంలోనే ఆమె ఎటిఎం కార్డును తస్కరించి తన వద్దనున్న డూప్లికేట్ కార్డును ఆమెకు అందించి ఈ కార్డు పనిచేయడం లేదని నమ్మించాడు. వెంటనే ఆమె బ్యాంకుకు వెళ్లి తన ఎటిఎం కార్డు పనిచేయడం లేదని బ్యాంకులో ఆరా తీయగా ఇది మీ కార్డు కాదని, ఎవరో మార్చేశారని చెప్పడంతో ఆమె అవాక్కయ్యింది. జరిగిన మోసాన్ని గ్రహించి ఆమె ఆచంట పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసేలోపే ఆమె అకౌంట్ నుంచి రూ.14 వేలు డ్రా అయినట్టు ఆమెకు మెసెజ్ వచ్చింది. ఈ మేరకు రాఘవమ్మ ఆచంట పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ముంపు ప్రాంతాల్లో సిపిఎం బృందం పర్యటన

ప్రజాశక్తి - వీరవాసరం

మండలంలో ముంపునకు గురైన నారుమడులను కాపాడాలని సిపిఎం మండల శాఖ డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం మండలంలో మునిగిన నారుమడులను బృందం పరిశీలించింది. తక్షణం మండలంలోని మురుగు డ్రెయిన్లను ప్రక్షాళన చేయాలన్నారు. మురుగు కాలువల్లో పేరుకుపోయిన తూడు, చెత్త వల్ల చేలల్లో నిలిచిన నీరు బయటకెళ్లే పరిస్థితి లేదన్నారు. పొలమూరు, గోస్తనీ, గొంతేరు మురుగు కాలువలకు అనుసంధానమైన మిగిలిన మురుగు కాలువల పరిస్థితి కూడా ఇలాగే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు జుత్తిగ నరసింహమూర్తి, బాలం విజయకుమార్, బొర్రా ఆలమహరాజు, కుడిపూడి పెద్దిరాజులు పాల్గొన్నారు.

అసెంబ్లీ సమావేశాలకు తణుకు విద్యార్థులు

తణుకు:చిట్టూరి ఇంద్రయ్య స్మారక ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి) తణుకుకు చెందిన 50 మంది విద్యార్థులు అమరావతిలో జరుగుతున్న అసెంబ్లీ సమావేశాలను సందర్శించినట్లు కళాశాల ప్రిన్సిపల్ పి.అనిల్‌కుమార్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ చాలా విషయాలు అనుభవపూర్వకంగా నేర్చుకున్నామని, అసెంబ్లీ సమావేశాలు అంటే ఎప్పుడూ టీవీల్లో చూడడమే తప్ప స్వయంగా చూడలేదని, ఇటువంటి అవకాశం మాకు రావడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. తణుకు నియోజకవర్గ శాసనసభ్యులు ఆరిమిల్లి రాధాకృష్ణను కలిశానని, కళాశాలలో ఉన్న సమస్యల గురించి వివరించగా ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు.

భారత సైనికుల త్యాగమే కార్గిల్ విజయ్ దివస్

ప్రజాశక్తి - భీమవరం టౌన్

మన బలానికి, సహనానికి, వాస్తవాలకు కార్గిల్ విజయగాథ నిదర్శనమని, దేశం కోసం ప్రాణాలు పణంగా పెట్టిన సైనికులు చిరకాలం గుర్తుండిపోతారని డిఎన్ఆర్ కళాశాల ప్రిన్సిపల్ జి.మోజేష్ అన్నారు. శుక్రవారం శ్రీవిజ్ఞానవేదిక, డిఎన్ఆర్ ఎన్‌సిసి యూనిట్ ఆధ్వర్యంలో కార్గిల్ విజయ దివాస్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌సిసి మేజర్ ఎ.వీరయ్య మాట్లాడుతూ కార్గిల్ యుద్ధంలో మాతృభూమి కోసం ప్రాణాలర్పించిన జవాన్లందరికీ నివాళులర్పిస్తున్నామన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడారు. అనంతరం ఎన్‌సిసి క్యాడెట్లతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ వి.సోమరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

భారత సైనికుల త్యాగమే కార్గిల్ విజయ్ దివస్ అని వన్‌టౌన్ ఎస్ఐ ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. క్విట్ ఇండియా స్తూపం వద్ద అరసవల్లి ఛారిటబుల్ ట్రస్ట్



నివాళులర్పిస్తున్న లయన్స్ సభ్యులు

ఆధ్వర్యంలో 19 మంది మాజీ సైనికులను శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ వెంకటేశ్వరరావు, ఎస్‌టిఐ అల్లూరి రవివర్మ మాట్లాడుతూ భారత్ సైన్యం పాకిస్తాన్ సైన్యంపై విజయం సాధించిన దానికి గుర్తుగా ఈ దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామన్నారు. ట్రస్ట్ అధ్యక్షులు అరసవల్లి సుబ్రహ్మణ్యం, ఎఎంసి మాజీ ఛైర్మన్ కోళ్ల నాగేశ్వరరావు, న్యాయవాది ఉండపల్లి రమేష్ నాయుడు మాట్లాడారు. అనంతరం ట్రస్ట్ ఆధ్వర్యంలో 19 మంది మాజీ సైనికులను సత్కరించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ విజ్జురోతి రాఘవులు, ముంతా రవి, అడ్డగర్ల ప్రభాకర్ గాంధీ, కలిగోట్ల గోపాలశర్మ, కొండ్రు శ్రీనివాస్ పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : వీర జవాన్లు దేశ సార్వభౌమాధికారాన్ని కాపాడడమే కాకుండా మన శక్తి సామర్థ్యాలను శత్రు దేశాలతో పాటు యావత్ ప్రపంచానికి చాటారని పేచర్ల ఫౌండేషన్ ఛైర్మన్ లయన్ పేరిచర్ల మురళి కృష్ణంరాజు తెలిపారు. కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా పేరిచర్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో వీర జవాన్లకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పేరిచర్ల ఫౌండేషన్, ఆర్అండ్‌బి వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు అందజేత

ప్రజాశక్తి - గణపవరం

మండలంలో జల్లికాకినాడ పెద్దపేట మండల పరిషత్ రెండో పాఠశాల విద్యార్థులకు శుక్రవారం ప్రభుత్వం అందించిన పాఠ్య పుస్తకాలు, యూనిఫారంను గ్రామసర్పంచి బాతు నాగేశ్వరరావు అందజేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచి వేగేశ్న సూరిబాబు, సంఘం పెద్దలు ఓగిరాల సత్యనారాయణ పాల్గొన్నారు.

217 జిఒ రద్దుపై హర్షం

ప్రజాశక్తి - నరసాపురం

మత్స్యకారుల సంక్షేమానికి విఘాతం కలిగించే జిఒ 217 రద్దు పట్ల నరసాపురం మత్స్యకార సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం సిఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్, మంత్రులు లోకేష్, అచ్చెన్నాయుడు, రవీంద్రకు చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో కొప్పాడ రవి, పొన్నాల నాగబాబు, పెమ్మాడి శశిదేవి పాల్గొన్నారు.

సిహెచ్ అగ్రహారంలో ఫ్రైడే డ్రైడే

గణపవరం:మండలంలో పిప్పర పిహెచ్‌సి పరిధిలోని సిహెచ్ అగ్రహారంలో శుక్రవారం ఫ్రైడే డ్రైడే నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎస్.సంతోషకుమార్ రెడ్డి మాట్లాడారు. ప్రతి శుక్రవారమూ ఫ్రైడే డ్రైడే నిర్వహించడం వల్ల దోమల వల్ల వచ్చే వ్యాధులను అరికట్టవచ్చన్నారు. గ్రామంలో ఇంటి పరిసరాల్లో మురుగు నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య సహాయకులు నామాల రాజు, ఎంఎల్ హెచ్ పి.మాధురి పాల్గొన్నారు.

ఉండి : పరిసరాల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఉండి పిహెచ్‌సి వైద్యులు బి.సాయి చంద్ర అన్నారు. శుక్రవారం పెదపుల్లేరు గ్రామంలో నిర్వహించిన ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ సాయిచంద్ర ఇంటింటా ఫీవర్ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత ఉండాలని, నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం నిర్వహించిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో రోగులను పరీక్షించి వారికి అవసరమైన పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో పెదపుల్లేరు విలేజ్ హెల్త్ క్లినిక్ సిబ్బంది, రోగులు పాల్గొన్నారు.

విఆర్‌ఒలపై ఒత్తిడి తగదు

పెనుమంట్ర:రాష్ట్రంలో పనిచేస్తున్న గ్రామ రెవెన్యూ అధికారులకు అసంబద్ధ డేటాతో సుమోటో క్యాస్ట్ సర్టిఫికెట్లు చేయాలని, మరో పక్క కౌలు కార్డులకు టార్గెట్లు పూర్తి చేయాలని అధికారులు ఒత్తిడి చేస్తున్నారని, దీంతో గ్రామ రెవెన్యూ అధికారులు నలిగి పోతున్నారని విఆర్‌ఒల సంఘం రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బి.రవీంద్ర రాజు, ఎం.అప్పలనాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఈ మేరకు వారు ఒక ప్రకటనలో తమ గోడు వెలిబుచ్చారు. రెవెన్యూకు సంబంధం లేని డ్యూటీలు, వేయడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే సచివాలయాల నుంచి గ్రామ రెవెన్యూ అధికారులను వేరుచేసి గ్రామస్థాయిలో గ్రామ రెవెన్యూ కార్యాలయాలు ఏర్పాటు చేసి రెవెన్యూ డిపార్ట్మెంట్‌ను బలోపేతం చేయాలని కోరారు. అలాగే ఒడిఎఫ్ ప్లస్ సర్వే విషయంలో విఆర్‌ఒలకు ఎంపిడిఒలు వేసిన డ్యూటీలు వెంటనే నిలుపుదల చేయాలని లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనకు పిలుపునిస్తామని వారు వెల్లడించారు.

కొత్త చట్టాలపై అవగాహనా సదస్సు

పెనుగొండ:మిషన్ శక్తి వంద రోజుల ప్రాజెక్టులో భాగంగా ఐసిడిఎస్ సూపర్‌వైజర్ మహిళలకు కొత్త చట్టాలపై అవగాహన కల్పించారు. ఎం.విజయ కుమారి ఆధ్వర్యంలో పెనుగొండ, సిద్ధాంతం పరిధిలో అంగన్వాడీ కార్యాలయాల్లో కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలకు 18 సంవత్సరాల నిండకుండా వివాహం చేయరాదన్నారు. కార్యక్రమంలో సిద్ధాంతం సెక్టార్ సూపర్‌వైజర్ రూతు కుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మొగల్తూరు:ప్రతి విద్యార్థీ చదువుపై ఏకాగ్రత కలిగి ఉండాలని సిడిపిఒ బి.ఊర్మిల సూచించారు. మిషన్ శక్తి వంద రోజులు కార్యక్రమంలో భాగంగా మొగల్తూరు పెనుమత్స రంగరాజ జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. బాలల హక్కులు, బాల్య వివాహాలు, కెరీర్ గైడెన్స్ అంశాలు, వ్యక్తి గత పరిశుభ్రత, ఆరోగ్యం తదితర వాటిపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పారా లీగల్ వాలంటీర్ వరలక్ష్మి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ విజయకుమారి, హెల్త్ సూపర్‌వైజర్ సాంబశివరావు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ ఎన్నిక

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం బార్ అసోసియేషన్ ఎన్నికల్లో ఉపాధ్యక్షులుగా కొత్తపల్లి రమేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయనతో పాటు కోశాధికారిగా పూరేళ్ల శ్రీనివాస్, సహాయ కార్యదర్శులుగా కురెళ్ల సోమశేఖర్, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా ఓసూరి జ్యోతి, తోట రాజ్యలక్ష్మి, దుర్గాభవాని ఎన్నికయ్యారు. ఈ నెల 31న ఎన్నికలు జరగనున్నాయి. ఇంకా అధ్యక్ష ప్రధాన కార్యదర్శితో పాటు లైబ్రరీ, క్రీడలు, సాంస్కృతిక తదితర విభాగాలకు ఎన్నికలు జరగాల్సి ఉంది. ఎన్నికల అధికారిగా నల్లిమిల్లి జోసఫ్ వ్యవహరిస్తున్నారు. ఉపాధ్యక్షులుగా ఎన్నికైన నూతన సభ్యులను శుక్రవారం న్యాయవాదులు అభినందించారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

పాలకోడేరు : విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని మహాత్మా గాంధీ మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షులు ఎంఆర్.రాజా ఆకాంక్షించారు. గొరగనమూడి శ్రీ జ్ఞానానంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. ఆయనకు శ్రీస్వామి జ్ఞానానంద, ఎపిజె అబ్దుల్ కలాంతో ఉన్న అనుబంధాన్ని వివరించారు. ఆయన సతీమణి సుభద్రాదేవి విద్యార్థులకు స్ఫూర్తి అవార్డ్స్ కింద నగదు అందజేసింది. అలాగే నెట్ బాల్ జాతీయ స్థాయిలో పాల్గొన్న విద్యార్థులను హెచ్ఎం బి.శ్రీదేవి , పిడిఎస్ విజయలక్ష్మిని అభినందించారు. ఈ కార్యక్రమంలో మురళి, శ్రీను, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్ఆర్‌కెఆర్‌కు బిబిఎ కోర్సు మంజూరు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలకు ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి బిబిఎ కోర్సు మంజూరైనట్లు శుక్రవారం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కెవి.మురళీకృష్ణంరాజు చెప్పారు. ఈ మేరకు ఉన్నతి విద్యా మండల్ నుంచి అనుమతి రావడంతో పాటు వెబ్ ఆప్షన్‌లో కూడా ఎస్ఆర్‌కెఆర్‌ను ఇంక్లూడ్ చేశారని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ఇంజినీరింగ్ కళాశాలలో కూడా బిజినెస్ కోర్సులు ఏర్పాటు చేస్తే విద్యార్థులకు ఎంతగానో ఉపయోగంగా ఉంటుందన్నారు.

చురుగ్గా జనసేన సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి - ఆచంట

మండలంలో జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమం చురుగ్గా సాగుతోందని జనసేన జిల్లా కార్యదర్శి చిట్టూరి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం వల్లూరులో జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి వివిధ వర్గాల ప్రజల నుంచి పెద్ద ఎత్తున స్పందన లభిస్తోందన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు జవ్వాది బాలాజీ శ్రీనివాస్, వైస్ ఎంపీపీ యర్రగొప్పుల నాగరాజు, మండల ఉపాధ్యక్షులు తోట తాతాజీ, వల్లూరు గ్రామ అధ్యక్షులు కడిమి ఉమామహేశ్వరస్వామి పాల్గొన్నారు.

ముగిసిన ప్రజా నాట్యమండలి శిక్షణా తరగతులు

ప్రజాశక్తి - భీమవరం

భీమవరం యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో మూడు రోజుల నుంచి జరుగుతున్న ప్రజా నాట్యమండలి రాష్ట్రస్థాయి శిక్షణా తరగతులు శుక్రవారంతో ముగిసాయి. ఈ సందర్భంగా ప్రజా నాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి అనిల్‌కుమార్ మాట్లాడారు. ప్రజానాట్యమండలిని రానున్న కాలంలో బలోపేతం చేయాలని తెలిపారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ప్రజల మధ్య మత ఘర్షణలు సృష్టించి కులాలు, మతాలు విభజించి గొడవలు సృష్టిస్తోందని, వాటిని ఎదుర్కోవాలంటే కళారూపాల ద్వారా ప్రజల్లోకి వెళ్లి బిజెపి చేస్తున్న దాడులను ప్రజల మీద వేస్తున్న భారాలను ప్రజలకు కళారూపాల ద్వారా చైతన్యం చేయాలని పిలుపునిచ్చారు. ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి షేక్ వలీ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి నాయకులు రంగ, చైతన్య ప్రసాద్, భార్గవ, శ్రీరాములు, శ్రీను గణేష్ పాల్గొన్నారు.

'వరద బాధితులను ఆదుకోవడంలో విఫలం'

ప్రజాశక్తి - యలమంచిలి

వరద బాధితులను ఆదుకోవడంలో టిడిపి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైసిపి పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల శ్రీహరి గోపి గోపాలరావు అన్నారు. శుక్రవారం వరద ప్రభావిత ప్రాంతమైన కనకాయలంక గ్రామంలో ఆయన వైసిపి శ్రేణులతో కలిసి పర్యటించారు ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ గత వారం రోజులుగా లంక గ్రామాల ప్రజలు వరద ప్రభావంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా ఇప్పటివరకు టిడిపి నాయకులు ఎవరూ లంకగ్రామాలను సందర్శించలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వరద బాధితులను ఆదుకునే విధంగా చర్యలు తీసుకోవాలని తహశీల్దార్ సిహెచ్ విజయశ్రీతో ఫోన్లో మాట్లాడారు. ఆయన వెంట మాజీ డిసిఎంఎస్ ఛైర్మన్ యడ్ల తాతాజీ, కనకాయలంక సర్పంచి మద్దా శ్రీనివాసరావు, శ్రేణులు పాల్గొన్నారు.

పంట కాలువల పరిశీలన

ప్రజాశక్తి - మొగల్తూరు

వైసిపి పాలనలో పంట కాలువలు, మురుగు కాలువలు ప్రక్షాళన చేయకపోవడంతో అన్నదాతలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోట గంగరాజు అన్నారు. శుక్రవారం జిల్లా కిసాన్ మార్చ్ జిల్లా అధ్యక్షుడు దాసరి బాబి ఆధ్వర్యంలో మండలంలో కాలువలు, డ్రెయిన్లు, నీట మునిగిన నారుమడులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పంట, మురుగు కాలువలు యుద్ధ ప్రాతీ పదికన ప్రక్షాళన చేయించేందుకు బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక నివేదిక రూపొందించి అధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని తెలిపారు. అనంతరం మండలంలోని ప్రధాన పంట కాలువలు, మురుగు కాలువలను పరిశీలించారు.

బడ్జెట్‌ను వ్యతిరేకించాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పేద, రైతు, కౌలు రైతు, వ్యవసాయ కూలీల వ్యతిరేక బడ్జెట్ అని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చింతకాయల బాబూరావు అన్నారు. గురువారం రాత్రి జగన్నాధపురం రైతు సంఘం గ్రామ అధ్యక్షులు మందపాటి విశ్వనాథం అధ్యక్షతన జగన్నాధపురం రామాలయం సెంటర్లో సభ నిర్వహించారు. ఈ సభకు ముఖ్యఅతిథిగా చింతకాయల బాబూరావు పాల్గొని మాట్లాడారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను వ్యతిరేకించాలన్నారు. దేశానికి అన్నం పెట్టే రైతులు, ఉత్పత్తిలో భాగస్వాములు అవుతున్న వ్యవసాయ కూలీలు, కౌలు రైతుల పట్ల కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. ఉద్యమాలతోనే హక్కుల్ని సాధించుకోవాలన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కండెల్లి సోమరాజు మాట్లాడుతూ ఉపాధి కూలీలకు బడ్జెట్లో రూ.2 లక్షల కోట్లు పెంచాలన్నారు. రైతు సంఘం మండల కార్యదర్శి పాలు పూరి సత్యనారాయణ మాట్లాడారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ముత్త శివన్నారాయణ, పీల కోటేశ్వరరావు, కూనవరపు నాగభూషణం, పిన్నమనేని సుబ్బారావు, జి.వెంకటేశ్వరరావు, గాది నాయుడు మాట్లాడారు.

పెంటపాడు : స్థానిక ప్రజాసంఘాల కార్యాలయం వద్ద సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో ముఖ్యుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం మండల కన్వీనర్ చిర్ల పుల్లారెడ్డి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిరపరపు రంగారావు, నాయకులు బంకురు నాగేశ్వరరావు మాట్లాడారు. కేంద్ర బడ్జెట్లో ఆంధ్ర రాష్ట్రానికి చాలా అన్యాయం జరిగిందన్నారు. రాజధాని నిర్మాణానికి రూ.1,5000 వేల కోట్లు అప్పుగా ఇస్తానని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రభుత్వం 2014లో విభజన చట్టంలో ఉన్న అంశాలు అమలు అమలుపర్చడానికి ప్రయత్నించాలన్నారు. కార్యక్రమంలో పెనగంటి దుర్గ, పి.వెంకటేశ్వరరావు, కారక వెంకట్రావు పాల్గొన్నారు.

నకిలీ బంగారంతో బురిడీ

ప్రజాశక్తి - నరసాపురం

నకిలీ బంగారంతో ఓ మహిళ తాకట్టు వ్యాపారస్తుడుని బురిడీ కొట్టించిన ఘరానా మోసం నరసాపురంలో చోటుచేసుకుంది. పట్టణ సిఐ కెవి.స్వామి కథనం ప్రకారం నరసాపురం పట్టణానికి చెందిన శిరిగినీడి ఉషారాణి మెయిన్ రోడ్డులోని జెపి బ్యాంకర్స్‌లో బంగారం తాకట్టు పెట్టి సొమ్ము తీసుకునేది. అలా పలుమార్లు చేయడంతో వ్యాపారితో పరిచయం పెరిగింది. కొంతకాలం తర్వాత వ్యాపారి తాను తాకట్టు పెడుతున్న వస్తువులకు గీటు పెట్టడం లేదని గమనించిన ఆమె మోసానికి తెరలేపింది. మొత్తం 23 వస్తువులను తాకట్టు పెట్టి రూ.67 లక్షలు తీసుకుంది. చాలాకాలమైనా విడిపించుకోవడానికి రాకపోవడంతో అనుమానం వచ్చిన వ్యాపారి తాకట్టు పెట్టిన ఆభరణాలను తనిఖీ చేయగా అవి నకిలీ బంగారం అని తేలింది. వెంటనే సదరు మహిళకు ఫోన్ చేయగా తాను ఊర్లో లేనని, వచ్చాక మాట్లాడతానని చెప్పి ఫోన్ స్విచ్ఛాఫ్ చేసింది. దీంతో ఆ వ్యాపారి సుమేద్‌మాల్ జైన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష కార్యదర్శులకు సత్కారం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

నూతనంగా ఎన్నికైన భీమవరం ఆర్యవైశ్య అధ్యక్షులు కంచర్ల కొండ, కార్యదర్శి అనంతపల్లి చలపతిరావు, కోశాధికారి సక్క శ్రీనివాస్‌ను మార్నింగ్ కాఫీ క్లబ్ సంఘం సభ్యులు శుక్రవారం ఘనంగా సత్కరించారు. స్థానిక ఆర్యవైశ్య భవనంలో కాఫీ క్లబ్ కన్వీనర్ బండా రాంబాబు, కన్వీనర్ ఓలేటి శ్రీను, విఆర్ఒ భట్టిప్రోలు శ్రీనివాసు వారిని సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన కార్యవర్గం ఆర్యవైశ్య సంఘం అభివృద్ధికి మరింత కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మానేపల్లి వెంకన్నబాబు, గుండు సుమూర్తి, కనగర్ల కిషోర్, కారుమూరి కిరణ్, సకల కుమార్ పాల్గొన్నారు.